# అమ్మా, మమ్మల్ని మన్నించవమ్మా!

అవసరాల రామకృష్ణారావు



"పోనీ అమ్మనికూడా మనతో ఆస్పత్రికి తీసికెడితే?" అన్న మా అబ్బాయి వైపు ఆశ్చర్యంగా చూశాను. "అంత కంటె పెళ్లికెడుతూ పిల్లిని చంకబెట్టుకు బయల్దేరడం నయం. అక్కడ యీవిడ చేసే సేవకన్న క్రియేట్ చేసే న్యూసెన్సు ఎక్కువ. అక్కడకూడా పిచ్చాపాటీ మొదలెడుతుంది. ఈవిడుండగా యిక ఆ రోగులకి నిద్రపట్టదు. డాక్టర్లకే ఊపి రాడదు. అటుపైన మీయిష్టం" "ఎప్పుడూ జబ్బని చీది ఎరగరుకదా, ఆస్పత్రిలో చేరడం అంటే గుండెదడ పట్టుకుందేమో మీ అబ్బాయికి!" అంది నవ్వుతూ కోడలు. నేనూ నవ్వుతూ ఎగాదిగా చూశాను వాణ్ణి. ఏ తండ్రి అయినా చూసి గర్వ పడవలసిన ధృఢమైన శరీరం మా ప్రసాదుది. ఇంచుమించు ఆరడుగులు చేరుతున్న హైటూ దానికి సరిగ్గా సరిపడే ఛాతీ ఎట్నుంచిచూసినా చెక్కిన శిల్పం లాంటి శరీరసౌష్టవం వాడిది. 'ఉన్నట్టుండి యిలా పిరికితనం పట్టుకుందేం?' అదే అడిగాను. "అదేం కాదుగాని ...." అంటూ యింకా ఏదో నసిగాడు. "అనవసరంగా అల్లరిపడడం తప్ప యీవిణ్ణి తీసికెళ్లితే కలిసివచ్చేదేం ఉండదు. మైనర్ ఆపరేషన్ అనీ ఒకేఒక రోజులో డిస్చార్జ్ చేస్తామనీ డాక్టరు చెప్పనే చెప్పేడు. మందులు తేడానికి నేనున్నాను. ఏ సాయానికయినా లీల ఉండనే ఉంటుంది. ఏమంటావ్?"

"అయితే సరే. మీరిద్దరూ ఎలాఅంటే అలాగే" అన్నాడు ప్రసాదు. జీవితంలో రుచీపచీ లేకుండా ఎలాగో రోజులు నెట్టుకొస్తున్నాను. ఉన్న ఒకేఒక కొడుక్కి ఎక్కడో చచ్చినంత దూరంలో ఆ కాన్పూర్ లో ఉద్యోగం. వాడూ కోడలూ ఏ శలవలకో యిలా నాలుగురోజులపాటు యింటిపట్టున గడపడానికి వచ్చినప్పుడే ఎండిపోయిన ఈ ఏటిలాంటి బతుకులో కాస్సేపు గలగల. ఈ కొద్దిపాటి సుఖానికైనా నోచుకోకుండా యీసారి వాడు వస్తూనే తొడలో ఏదో కురుపులేసిందంటూ బాధపడడమేమిటి? అంతా కర్మ ....అలాగేనా ఉండకుండా ఆపరేషను దాకా రావడమేమిటి? పోన్లెండి. ఎక్కడికక్కడే సంతోషించాలి. ఇదేదో అంతగా అపాయంలేని ఆబ్సెస్ ట. చిన్న శస్త్ర చికిత్సతో తొలగించుకోవచ్చుట.

"కాస్త నొప్పి సర్దుకుందా బాబూ?" అనుకుంటూ మా ఆవిడ అక్కడికొచ్చింది. "ఇంక ఆలశ్యమెందుకు? చెప్పు" అన్నట్లు నేను సంజ్ఞచేశాను.

"ఓసారి నేనూ లీలా మా మావగారి ఊరెళ్లి రెండ్రోజులు ఉండొస్తామే అమ్మా" అన్నాడు ప్రసాదు.

"అదేమిట్రా, రాత్రంతా ఆ కురుపు బాధతో గొడ్డుమూలిగినట్టు మూలుగుతున్నావ్ .... అడుగుదీసి అడుగువెయ్యలేకుండా ఉన్నావ్ ... తగ్గేక వెళ్లొచ్చు కదా...."

"ఇప్పటికే శలవు అయిపోయింది చాలావరకు. కురుపు తగ్గిపోయాక వెడదామనే యిన్నాళ్లూ చూశాను. ఇప్పుడు కొంచెం పోటు తగ్గింది. డాక్టరుగారు ఈసారిచ్చిన మాత్రలు బాగా పనిచేసినట్టున్నాయి. ఇవాళ భోంచేసి బయల్దేరుదామనుకుంటున్నాం. మూడొంతులు ఎల్లుండి రాత్రికి తిరిగొచ్చేస్తాం. ఏమే?" "ఏమోరా బాబూ... ఏం వెడతారో ఏమో.... నిన్ను తీసికెళ్లి దార్లో చిన్నపిల్ల ఏం యిబ్బంది పడుతుందో ఏమో .... ఏమండీ, మీరేమంటారు?"

దొరికిన అవకాశాన్ని నేనేనా ఒదులుకొనేది!

"పోనీ నేనుకూడా వాళ్లతో వెళతాను లేవే! తను రావడమేగాని నేను అక్కడికి వెళ్లడంలేదని వియ్యంకుడి నిష్ఠూరం ఉండనే ఉంది."

"మీరు కూడాఉంటే నాకు ధైర్యమే. అయితే ఆలశ్యమెందుకు, పదిన్నర బస్సుకే బయల్దేరుదురుగాని. ఉండండి, కంచాలు పెట్టేసి భోజనానికి పిలుస్తాను. అన్నట్టు మరచేపోయాను. మీ స్నానం అయినట్టులేదు! బాగుంది వరస, గబగబా వెళ్లిరండి."

అంటూ హడావిడిగా లోపలికి వెళ్లిపోయింది.

నేను గబగబా రెండు చెంబులు నీళ్లోసుకుని తువ్వాలు చుట్టబెట్టుకుని వసారాలోంచి నా గదిలోకి వెళ్లబోతూ ఉంటే వాళ్ల గదిలో టైపుచేస్తున్న శబ్దం వినబడి ఆగేను. అప్పటికప్పుడే ఆస్పత్రికి తీసికెళ్లవలసిన సామాన్లు ప్యాక్‌చేసి వాటి లిస్టుని నీట్‌గా టైపుచేస్తోంది లీల! ఆ పోర్టబుల్ టైప్‌రైటరు ఆమె యూనివర్సిటీ ఫస్టుగా ఎమ్మెస్సీ పాసయినప్పుడు వాళ్లనాన్న ప్రెజెంటుగా యిచ్చినది. ఎంత చిన్న ఆపరేషను అయినా ఏంగ్జయిటీ అంటూ ఉంటుందిగదా! అయినా చెక్కుచెదరలేదు ఈ అమ్మాయి. ఏదో కూనిరాగం తీసుకుంటూ టైపు చేసుకొంటోంది.

అక్కడ మా ఆవిడ ఏంచేస్తోందని? ఊరంతటికీ వినపడేటంత పెద్దగొంతుకతో పెరటిగోడ పక్కనుండి పక్కింటి పిన్నిగారికి యీ వార్త అందిస్తోంది. "విన్నారా సిన్నిగారూ, మావాళ్లకి ఏ నిముషానికి ఏంతోస్తే అంతే. ఇప్పటికిప్పుడు పదిన్నర బస్సుకి బయల్దేరుదామంటే నేనెంతకని కచ్చల్లో కందులు వేపుకొనేది చెప్పండి? పాలూ పంచదార ఉన్నాయికదా అనుకుని సిద్ధపడుదునూ, దిక్కుమాలిన సేమ్యాడబ్బా మూత సరిగ్గా లేదేమో మెత్తపడిపోయింది. మీ బాబిగాణ్ణి ఓసారి పంపుదురూ, తల్లి, తల్లి, కొట్టుకి పరిగెత్తించి ఓ పాకెట్ తెప్పిస్తాను.... మళ్లీ ఆ ఊరికి ఏ వేళకిచేరతారో ఏమో... "

అబ్బబ్బ, ఎంత పెద్దగొంతుక! జీవితమంతా చెప్పి చెప్పి విసిగెత్తిపోయింది. కడుపులో చల్ల కదలకుండా ఎన్నిపనులయినా చేసుకోవచ్చు మనయింట్లో మనం ఏంచేసుకున్నామో ఏమో ఎప్పటికప్పుడు పక్కింటికి చేరేస్తేగాని కొందరు ఆడవాళ్లకి తోచిచావదా!

పెళ్లై నాలుగేళ్లు అయిందోలేదో కొడుకూకోడలికీ మధ్యఉన్న 'ఇంటలెక్చ్యువల్ కంపానియన్‌షిప్ చూస్తూంటే ముచ్చటేస్తోంది. మాలాంటి వాళ్లం ముప్ఫైకాదు గదా మూడొందలేళ్లు ఓ చూరుకింద అఘోరించినా ఒకటే! అందులో యీ మధ్య రిటైరై, చేతిలో తగినంతపని లేకకాబోలు, గడ్డకట్టుకుపోయిన ఏకాంతంలో నా బుర్ర మరీ పిచ్చెత్తిపోయింది. ఎవర్నో అనుకోడం దేనికి? ఇన్నాళ్లు దీన్తో కాపురం చేసినందుకు నాలాంటివాళ్లని నిలువునా షూట్ చేసినా తప్పులేదు. దగ్గిర దగ్గిరగా ఉన్నా మామధ్య ఎంతదూరం! ఈ వయసులో యిప్పటికికూడా తిరగేస్తున్న రకరకాల మేగ్జయిన్సుకాక, కరస్పాండెన్సు కోర్సు తెప్పించుకుని, యింకా ఏవేవో టెస్టులకి అలా కడుతూనే ఉంటాను నేను. ఇంత చదువుకున్నా నాకు సరిగ్గా నిద్రపట్టదు. మాత్రవేసుకు పడుకున్నా అటూ ఇటూ పొర్లుతూ ఉంటాను. ఇక నా పక్కన పడుకున్న మా ఆవిడ సంగతి? మళ్లీ పదోఎక్కం దాటలేదు. పాలపద్దు చూడ్డానికయినా నా సహాయం కోరక తప్పని పరమమొద్దు మెలకువ ఉన్నంతసేపు చేసిన శబ్దప్రసారం చాలదా? నిద్రపోతున్నప్పుడు కూడా విధిగా యిల్లెగిరిపోతున్నట్లు గుర్రుపెట్టాలా! నా అంచనాకి అది అందకపోతే మేమిద్దరం దంపతులం అయిన నేరానికి- దానికి నేనూ తగినజోడీని కానని అదీ అనుకోవాలి గదా, పోనీ అలాగైనా అనుకుని బాధపడినట్టు కనబడదేం? నిజంగా ఏ మాత్రం బాధపడిన మనిషిఅయినా అంత నిశ్చింతగా నిద్రపోగలదా? ఏ విధంగా చూసినా ఓటమి నాదేనా?

పోన్లెండి, ఎవరి రీజనింగు వాళ్లది. ఈ చదువులతల్లే నన్ను ఆదరించి ఒళ్ళోకి తీసుకోకపోయిఉంటే ఆ రోజుల్లో మా సవితల్లి పెట్టిన బాధలకి పిచ్చెత్తి ఎక్కడికో పారిపోయిఉందును. ఎవళ్లనేనా జ్ఞానం ఒకటే రక్షించేది. మూఢవిశ్వాసాలు సెంటిమెంట్సు మనిషి మరింత కూరుకుపోవడానికి తోడ్పడతాయి. అందుకే ఎంతో డిసిప్లిన్‌తో చిన్నప్పట్నుంచీ కాన్వెంటులో చదువుకున్న అమ్మాయినే కోడలుగా ఎంచుకున్నాను. అంతేకాదు, ఫస్ట్‌ఛాన్సులోనే ఐ.ఏ.యస్.లో మంచి రాంకులో మా ప్రసాదు వచ్చాడంటే ఆ క్రెడిట్ ఎవరిది!

ఇలా ఆలోచించుకుంటూ పోతే వీటికి తెరిపీ, తెన్నూ ఎక్కడివి? మా కోడలి కేకతో మళ్లీ యీ లోకంలోపడి, వెళ్లి ఆటోరిక్షాలో కూచున్నాను నేను.

మరి ఆ ఆపరేషన్‌లో ఏం అడ్డదిడ్డముందో విడమరచి చెప్పే మెడికల్ నాలెడ్జి నాకు లేదు. సాయంకాలం తెలివి వచ్చిందగ్గిర్నుంచీ ప్రసాద్‌ని పట్టుకోవడం కష్టమైపోయింది. పైగా టెంపరేచరు రైజ్‌అయేటట్టుంది. గంటగంటకీ డాక్టరుగారు ఇంజక్షను యిచ్చి వెళ్తారు. ఓ అరగంట పడుకున్నాడో ఏమో మళ్లీ లేచి కూచుని నానా అల్లరీను.

కుర్రాడి జబ్బు కాదుగాని నా మనసుకి పట్టిన రోగం కుదురుతోందా అనిపించింది. వాడి ఒక్కొక్క చేష్టా దగ్గిరుండి గమనిస్తూంటే ఏదో కొత్త సత్యానికి దగ్గిరవుతున్నట్టు ఫీలయాను.

"ఏమిటండీ మరీ చిన్నపిల్లాడిలా, ఇదిగో మీకిష్టమైన హిందీపాట పెడుతున్నాను టేపు రికార్డరులో, వింటూ కళ్లు మూసుకోండి, హాయిగా నిద్రపడుతుంది."

"ఆ రికార్డు ఆపుచేస్తావా, అవతల విసిరెయ్యమన్నావా!" అని వాడంటూంటే నాకు మతిపోయింది.

"ఇదిగో యాపిల్సు తెచ్చాను. లీల ముక్కలుగాకోసింది. ఎంత యూనిఫాంగా నైస్‌గా ఆర్టిస్టిక్‌గా అమర్చిందో చూడు. రెండు ముక్కలు నోట్లో వేసుకో."

అనే నా మాటకి వాడి రెస్పాన్సు)

వ్యతిరేకతతో పెద్ద మూలుగు మాత్రమే పైగా ఆ ప్లేటు తోసెయ్యడం కూడాను.

ఎందుకైనా మంచిదని స్పెషల్ వార్డులో జాయిన్‌చేశాం వాణ్ణి. నేనో సారి బాత్‌రూంకి వెళ్లి యివతలి కొస్తూంటే కంటపడ్డ దృశ్యం యిదీ!

"ఇదిగో డార్లింగ్. ఏమిటి నీ బాధ? ఇప్పటికీ కొంచెంకూడా రిలీఫ్ లేదా? పోనీ నన్ను అనుకుని పడుకుంటావా, దానిమీద చెయ్యివేసి నెమ్మదిగా రాయనా?"

అని, పాపం ఎంతచెయ్యాలో అంతా ట్రై చేస్తోంది లీల. 'యూ ఫూల్ గెటవే' అని ఒక్క అరుపు అరిచాడు ప్రసాదు. పాపం ఆ అమ్మాయి గుడ్ల నీరు కక్కుకుని లేచిపోయింది. ఇదేదో కొంపముంచేలా ఉందని నేను నైట్ షిప్టు డాక్టర్‌ని లేపుకొచ్చాను. ఆయన కాంపౌండర్‌తో వచ్చి, ఓ పావుగంట పరీక్షచేసి, ఓ వేళ కట్టు బిగుతుఅయిందేమో అని మళ్లీ మార్చి, నిద్రకి ఏదో పౌడర్ యిచ్చి, మరో పెన్సిలిన్ యింజక్షన్ యిచ్చివెళ్లేరు.

ఈ సారి భగవంతుడి దయవల్ల మా వాడు నెమ్మది నెమ్మదిగా కోలుకుంటున్నట్టు అనిపించింది. రాత్రి ఏ ఒంటిగంటకో పడుకున్నవాడు మరి తెల్లగా తెల్లారేదాకా లేవలేదు. పోనీ అప్పటికేనా, మాకు రిలీఫ్ ఉందా? వెళ్లి నిలుచున్న పళాన అమ్మని తీసుకురమ్మని కూచున్నారు.



మేమిద్దరం ఒకరిమొహాలు ఒకరు చూస్తూ ఉండిపోయాము. ఎక్కువ బాధ తగ్గిపోయింది గదా.... ఇప్పుడెందుకు, అయినా పాలు పట్టే వయసుగాని పాలు తాగే వయసు కాదు గదా.... పోనీ ఏ చదువూ సంధ్యాలేని అమాయకుడేమో అనుకుంటే అదీ కాదుగా........ అవన్నీ అలా ఉంచి పెళ్ళయిన మొదలు పెళ్లాం కొంగుపట్టుకు తిరిగిన ఘటం మా పుత్రరత్నం. అయినా వాళ్లిద్దరూ వేరు వేరు మనుషులని అనుకోనంతగా ఒక్కటిగా మసలేవారు. ఓ చోట ఉన్నా యింకో చోటికి వెళ్లినా జంటగానే. ఈ నాటికి కాస్త నొప్పి తగిలేసరికి అమ్మ కావలసి వచ్చిందా?

"ఏం నాన్నా, అమ్మని వెళ్లి తీసుకు రమ్మన్నానుగా, యింకా కదలవేం?" అని మరోకేక.

నేను చికాకుగా సంచీమీద చెయ్యి వేశాను. లోపల ఏదోపుస్తకం తగిలింది. 'బ్రెయిన్ టీజర్సు' అనే పుస్తకం అది. ఇది తెచ్చాననే సంగతే మరచిపోయాను. "చూడు బాబూ, చాలావరకు తగ్గిందన్నావుగా, ఈ పుస్తకంలో పజిల్స్ సాల్వ్ చెయ్యడంలో మనసు మెల్లిగా లగ్నం చెయ్యి. ఇదిగో తీసుకో".

వాడా పుస్తకాన్ని కిందపడిపోయేలా తోశాడు. "నేనడిగింది వెంటనే అమ్మను తీసుకురమ్మని."

నాకు ఒక్కసారి భగ్గున మండింది ఒళ్లు. అలాగే తీసుకొస్తాంలే.... అందాకా

యింక ఎదుటివాళ్ల కనపడరండూ....
నా గుండెమీద దెబ్బతీసినట్టయింది.

ఏబీసీడీల మొదలు ఎమ్మేవరకూ ఏం చదవాలో ఎలా చదవాలో దగ్గరుండి ప్రోత్సాహం ప్రోద్బలం యిచ్చింది నేను కాదా? ఇంత చిన్నవయస్సులో యీయన గారు యింత పెద్ద ఉద్యోగంలో యిలా వెలిగిపోతున్నారంటే దీనికి పూర్తిపునాది అడుగడుగునా నేను వేసింది కాదా! .... కోడలివైపుమాస్తే తలదించేసుకు ఉంది.

"నే చెప్పింది వినబళ్లేదా, ఒక్కరూ కదర్లేం?"

ఏంచెయ్యాలో తోచక యిద్దరం గది బయటి వరండాలోకి వచ్చాం. ఊరికని బయల్దేరదీసి, యిలా వీణ్ణి ఆస్పత్రిలో చేర్చేం. ఏంచెప్పి అవిణ్ణి తీసుకురాను? ఇంతలో ఆ వరండా చివర్నుంచి యిటు వైపు మా ఆవిడ పిలిచినట్టు రావడం చూసి ఉన్నమతికూడా పోయినట్టయింది మాకు!

మా ఎదుటగది పేషెంటుని చూడ్డానికి అతని బావమరిది వచ్చాడుట. వాళ్లకి మా ఎదురింటివాళ్ల చుట్టాలట. ఏముంది, యీ కబురు ఒక ఆవిడికి చేరిపోయింది? "ఇలాబస్సుస్టేండుకి చేరుకున్నామో లేదో ప్రసాదుకి ఉన్నట్టుండి సలుపూ పోటూ, ఎక్కువైపోయింది. ఎంతకీ తగ్గలేదు. ఆస్పత్రికి చేర్చక తప్పలేదు డాక్టరుగారు పరీక్షచేసి వెంటనే ఆపరేషన్ చెయ్యాలన్నారు. నీకెలా కబురుచేద్దామా అని కొట్టుకుచచ్చాం. ఇంతలో దేవుళ్లా నీకు కబురుతెచ్చిన మనిషి కనిపించాడు."

అంటూ ఆ తర్వాత ఎలాగో సర్ది చెప్పేను, అది వేరే విషయం.

మేఘలా తెల్లబోయి చూస్తూంటే సుడిగాలిలా మమ్మల్ని దూసుకువచ్చి తుఫానులా గదిలోకి ప్రవేశించింది. మేమిద్దరం చేసేదిలేక కిటికీ దగ్గర నిలబడి పోయాం.

ఆ కాస్పేటిలో అదిచేసిన పనులు ఎన్నని? గంటముందు ఏదో అవసరం వచ్చి వాణ్ణి ఓపక్కకి ఒత్తిగిలేలా చెయ్యడానికి మా యిద్దరికీ ముచ్చెమటలు పోశాయి. అలాంటిది పిచిక అంత ఉంటుంది. నిమిషాలమీద వాణ్ణి ఓ కంఫర్టబుల్ పొజిషన్‌లోకి మార్చింది. తొడకి ఓ పక్కగా మెత్తటితలగడా అమర్చింది. తడిగుడ్డపెట్టి మొహాన్ని తుడిచింది. ఆ చినుకుల్లో ఎవర్ని పరిగెత్తించి ఎక్కణ్ణుంచి తెప్పించిందో వేడి వేడి పాలు సంపాదించి, బ్రూకాఫీ కలిపి వాడికి పట్టింది. ఫేన్ స్లో చేసింది. తను గోడకి చేరి కూచుని వాడి శరీరాన్ని నెమ్మదిగా ఒళ్ళోజేరబెట్టుకుని "నేనొచ్చాగా, మరేం ఫరవాలేదు. కాస్సేపు కళ్లు మూసుకుని చూడు నాన్నా, నిద్రపడుతుందేమో!" అంటూ నెమ్మదిగా జోకొట్టడం మొదలెట్టింది.

ముప్ఫైఏళ్ల ఉక్కుముక్కా మూడేళ్ల దూదిపింజై అమ్మ ఆర్ద్రతకి అంకితమైపోయాడు మావాడు.తనకి బాధావిముక్తిని ప్రసాదించిన మాతృమూర్తి మధుర స్పర్శ మళ్లీ ఎక్కడ మటుమాయమౌతుందో అన్నట్టు తల్లి చేతిని గట్టిగాపట్టుకు కూచున్నాడు!

జరిగిందంతా వింతగా కళ్లింతింతలుగా మేమిద్దరం చూశాం. ఓ మూలకి రమ్మన్నట్టు నన్ను పిలిచింది లీల. ఆ అమ్మాయి చదువుకున్నది. నా కూతురు లాంటిది. సంకోచం లేకుండా ఏదైనా నాతో చెబుతుంది. వెంటనే వెళ్లేను. "చాలా పొరపాటు చేశాం. పోన్లెండి, తెలుసుకున్నాంగా!" ఏం చెబుతోందో తెలీకుండా అవునన్నట్టు కళ్లెగరేశాను. "అడది కోరుకోదగ్గది అతి ప్రియమైనదేమిటో యివాళ నాకళ్లతో నేను స్పష్టంగా చూశాను. ఇన్నాళ్లూ మేం ఫామిలీ ప్లానింగు అబ్జర్వ్ చేస్తున్నామని మీరు ఊహించే ఉంటారు. ఐ హేవ్ డిసైడెడ్ టు స్టాప్ యిట్ ఎట్ ఒన్స్. నన్ను దీవించండి" అంది! ఇన్నాళ్లూ ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్ ఒకటే మనిషికి గీటురాయి అనే తప్పుడుదారిలో పడ్డాను. విద్య అనేది మనసుని వికసింపజెయ్యడానికే తప్ప ముకుళింపచెయ్యడానికి కాదని యిన్నాళ్లకి తెలుసుకున్నాను. ఇన్నాళ్లూ అంటే ఎంతకాలం! ఈ సత్యం గ్రహించడానికి నాకో జీవితకాలంపట్టింది! నాలో సగం వయస్సయినా లేని లీల నాకంటె ఎంతో ముందుగా యీ విషయాన్ని పసిగట్టింది. లీలని దీవించడానికి నాకున్న అర్హత ఏమిటని!

అంతేకాదు సహృదయతా సానుభూతి లేకపోతే అది మనిషిజన్మ అనరని ఎన్ని పుస్తకాల్లోనో చదివాను, ఏంలాభం? ఎప్పుడో చిన్నప్పుడు సవిత్తల్లి బాధలు పెట్టిందని యీ చచ్చేకాలంలో ప్రతి నిమషం తలుచుకుంటాను.మధ్యకాలంలో ఓ మధురమూర్తి నా బతుకులో ప్రవేశించి మూడు దశాబ్దాలుగా అడుగడుగునా అమ్మలేని లోటు తీరుస్తూంటే ఒక్కసారి, ఒక్కసారైనా అనుకున్నానా!

"ఏమిటాలోచిస్తున్నారు,మామగారూ!" అంది లీల." నువ్వు తీసుకున్న నిర్ణయం సరియైనదే. గాడ్ బ్లెస్ యూ" అనడం కన్న మగాణ్ణి నాకేం చేతనౌను?కరుణామయులైన తరుణీమణులకే గర్వం ధరించే వరకు యిచ్చింది ప్రకృతి!

